హైదరాబాద్ వార్త





హైదరాబాద్ పాతబస్తీలోని ప్రజా పాలన ధరఖాస్తుల కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎంపి అసదుద్దీన్

## నేడు అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు



హైదరాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త : పాత ఏడాదికి గుడ్ బై చెబుతూ..కొత్తేడాదికి వెల్‌కమ్ చెప్పేందుకు ప్రజలంతా సిద్ధమవుతున్నారు. అర్ధరాత్రి వరకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపై సందడి చేస్తుంటారు. ఇందులో భాగంగానే ప్రజల సౌకర్యార్థం మెట్రో వెసులుబాటును కల్పించింది. ఆదివారం అర్ధరాత్రి వరకు రైళ్లను నడపాలని మెట్రో రైల్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. డిసెంబరు 31, ఆదివారం రాత్రి హైదరాబాద్ మెట్రో రైలు సర్వీసుల సమయాన్ని పొడిగించినట్లు తెలిపింది. అర్ధరాత్రి 12.15 గంటల వరకు మెట్రో సర్వీసులు నడుపుతున్నామని మెట్రో రైలు ఎండి ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. చివరి రైలు ఆయా స్టేషన్ల నుంచి 12.15 నిమిషాలకు బయలుదేరుతుందని తెలిపారు. అర్ధరాత్రి 1 గంటకు ఈ రైలు గమ్యస్థానానికి చేరుకుంటుందని తెలిపారు.

### ప్రజాపాలన కేంద్రాలను
## తనిఖీ చేసిన కలెక్టర్

హైదరాబాద్, డిసెంబరు 30,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలనలో భాగంగా లబ్దిదారులు సమర్పించే దరఖాస్తులలో అన్ని కాలమ్స్ నింపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం బహదూర్‌పురా నియోజకవర్గంలోని కిషన్‌బాగ్ పార్క్, చంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని ఎన్ఎసి, చార్మినార్ నియోజకవర్గంలోని ప్లేట్ల బురుజులలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన లబ్దిదారులతో ముఖాముఖిగా మాట్లాడటమే కాకుండా దరఖాస్తు ఫారాలను పరిశీలించారు. ఈసందర్భంగా దరఖాస్తులదారులు ఆయా గ్యారెంటీల కింద లబ్దిపొందేందుకు నింపిన పారాలను పరిశీలిస్తూ అన్ని కాలంలు పూర్తిగా నింపే విధంగా అధికారులు ఆర్జీదారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని, అవసరమేతే దరఖాస్తు నింపి ఇవ్వాలని అన్నారు. ఒకకుటుంబానికి ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించాలని, దరఖాస్తు పారాలు ప్రభుత్వం ఇచ్చినవైనా, జిరాక్స్ ఫారాలైనా అనుమతించాలన్నారు. అలాగే దరఖాస్తులును నింపడంలో ఏరంగు పెన్ను ఉపయోగించి పూర్తి చేసినా, తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ బాషల్లో ఏబాషలో నింపి సమర్పించినా అనుమతించాలని కలెక్టర్ సూచించారు. రేషన్‌కార్డుల కోసం ప్రత్యేకంగా నమోదు చేసుకోవాలని, దరఖాస్తు ఫారంలో ఉన్న ఐదుగ్యారెంటీలు కాకుండా ఇతర సమస్యలపై వచ్చే సమస్యలపై వచ్చే దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దాని ద్వారా స్వీకరించాలని అలాగే రశీదు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, బహదూర్‌పురా ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ వెంకన్న, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్‌లో భారీ చోరీ

### వజ్రాలు, బంగారం మాయం

హైదరాబాద్, డిసెంబరు 30,ప్రభాతవార్త: పనిచేస్తున్న ఇంటికే కన్నం వేసిన మహిళ కోసం బంజారాహిల్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్ నెం.8లోని వైట్‌హౌస్ సెలెస్టియా అపార్ట్‌మెంట్‌లో నివసించే కొడాలి ధనలక్ష్మీ అక్టోబర్ 16వ తేదీన మంగోలియా దేశం విజిట్ చేసేందుకు బ్యాగులో మూడు వజ్రాలు పొదిగిన గాజులు, ఒక బంగారు గాజు, మరో వాచిని సర్దుకుంది. ఆబ్యాగ్ తీసుకుని మంగోలియా యాత్రకు వెళ్ళింది. అక్కడికి చేరిన తర్వాత బ్యాగు తెరిచి చూడగా అందులో ఉండాల్సిన రూ.10లక్షల వజ్రాభరణాలు, వాచ్ కనిపించలేదు. ఈనెల 24వ తేదీన ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లో చూడగా ఎక్కడా కనిపించలేదు. బ్యాంకు లాకర్లో కూడా దొరకలేదు. అయితే ఇంట్లో పనిచేసే శ్రీలత అనే పనిమనిషి తాను మంగోలియా వెళ్లే సమయంలో బ్యాగును సర్దిందని ఆసమయంలో వాటిని తస్కరించి అంటుందని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వద్దు మీరొద్దు



- న్యూఇయర్ వేడులకపై పోలీసుల ఆంక్షలు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు,. ఫ్లైఓవర్ల మూసివేత
- హంగామా సృష్టిస్తే కఠిన చర్యలు
- ప్రత్యేక బృందాలతో పోలీస్,ఎక్సైజ్‌శాఖలు నిఘా

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..**

నిబంధనల ప్రకారం రాత్రి 8గంటలనుండి అర్ధరాత్రి ఒంటిగంట వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. డీజే సౌండ్స్‌తో ఇతరులకు ఇబ్బందులు కలిగించే పనులు చేయరాదు. శబ్దం 45డెబిల్స్ దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేడుకల్లో భాగంగా బాణాసంచా కాల్చడం నిషేదం.వేడుకలు ప్రారంభం నుండి పూర్తి అయ్యే వరకు వీడియేలు చిత్రీకరించి వాటిని 1,2తేదీల్లోపు కమీషనరేట్స్‌లో అప్పగించాలి. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్నా నిర్వాహకులే బాద్యులు అవుతారని దీనిని దృష్టితో ఉంచుకుని వేడుకలు నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా నగరంలోని అన్ని రోడ్లపై డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించనున్నారు.చిత్తుగా తాగి డ్రైవింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేసి వాహనాలు స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలుపుతున్నారు.




హైదరాబాద్, డిసెంబరు 30,ప్రభాతవార్త: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి, కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికే న్యూఇయర్ వేడుకలపై పోలీసులు నజర్ వేశారు. వేడుకల సందర్భంగా రెచ్చిపోయే యువతకు బ్రేకులు వేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. నగరంలోని మూడు కమీషనరేటర్ల పరిధిలో వేడుకలు జోష్‌గా జరిగే అవకాశం ఉండటంతో ఉన్నతాధికారులు అన్నిపోలీస్ స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. వేడుకల్లో శృతిమించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎలా పాటించాలనే దానిపై సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ సివిల్,పోలీసులతోటు, ఎక్సైజ్,ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు అలాగే ఇతర విభాగాలకు చెందిన పోలీస్ బలగాలను రంగంలోకి దింపారు. పోలీస్‌స్టేషన్ల వారిగా ఏఏప్రాంతాల్లో వేడుకలు జరగుతున్నాయి.వాటికి ఎంతమంది హాజరయ్యే అవకాశం ఉంది.అక్కడ నిర్వహించే కార్యక్రమాల వివరాలను పూర్తిగా సేకరించారు. వేడుకల సందర్భంగా నిషేదిత మాదక ద్రవ్యాలు వాడే అవకాశం ఉండటంతో ఈఅంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నిషేధిత మాదకద్రవ్యాలు సప్లై చేయడం, వాటిని వాడటం వంటివి గుర్తిస్తే కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయనున్నారు. మత్తెక్కించే మద్యం, శరీరం మొత్తం షేక్ చేసే మ్యూజిక్‌ల నడుమ యువత వేడుకల్లో శృతిమించితే ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు. న్యూఇయర్ వేడుకల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవంటున్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు.. ఫ్లైఓవర్ల మూసివేత**

న్యూఇయర్ వేడుకల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనుచోటు చేసుకోకుండా నగరమంతా డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించనున్నటు తెలిపారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్‌మార్గ్‌లతోపాటు నగరంలోని అన్ని ఫ్లైఓవర్‌లను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈఆంక్షలు 31(ఆదివారం) రాత్రి 10గంటల నుండి జనవరి 1(సోమవారం) తెల్లవారుజామున 6గంటల వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

**వాహనాల అనుమతి లేని ప్రాంతాలు..** ఖైరతాబాద్ నుండి ఎన్టీఆర్‌మార్గ్, నెక్లెస్‌రోడ్ వైపు ట్రాఫిక్ అనుమతించరు. వాటిని ఖైరతాబాద్ రాజ్‌భవన్‌వైపు దారి మళ్ళిస్తారు. అలాగే బీఆర్‌కే భవన్ నుండి ఎన్టీఆర్ మార్గ్‌కు అనుమతిలేదు. వాటిని ఎగ్బాల్ మినార్ నుండి లక్డీకాపూల్ వైపు దారి మళ్లిస్తారు. లిబర్టీ నుండి ట్యాంక్ బండ్ వచ్చేవాహనాలను జీహెచ్ఎంసీ ఆఫీస్ వైజంక్షన్, బిఆర్‌కే భవన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్,ఎక్బాల్ మినార్, నుండి రవీంద్రభారతి వైపు దారి మళ్లిస్తారు. ఖైరతాబాద్ మార్కెట్ నుండి నక్లెస్ రోడ్‌కు ట్రాఫిక్ అనుమతించరు..మింట్ కాంపౌండ్ నుండి సచివాలయం వైపు వెళ్లేమార్గాన్ని మూసి ఉంచుతారు. నల్లగుట్ట రైల్వే బ్రిడ్జ్ నుండి సంజీవయ్యపార్క్‌కు అనుమతించరు. వాటిని సైక్లింగ్ క్లబ్ నుండి కవాడిగూడ వైపు దారి మళ్ళిస్తారు.

**సైబరాబాద్, కమిషనరేట్ పరిధిలో..** ఓఆర్ఆర్‌పై రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజాము 5గంటల వరకు విమానాశ్రయానికి వెళ్లే వాహనాలు తప్ప ఇతర వాహనాలకు అనుమతి ఉండదు. పివి. నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే ఫ్లైఓవర్ పైనా నిబంధనలు అమల్లో ఉంటాయి. గచ్చిబౌలి శిల్లాలేవుట్ ఫ్లైఓవర్, గచ్చిబౌలి ఫ్లోఓవర్, బయోడౌఐవర్సిటీ పార్క్ ఫ్లైఓవర్ 1,2 షేక్‌పేట్ ఫ్లైఓర్, మైండ్ స్పేస్ ఫ్లైఓవర్, రోడ్ నం.45ఫ్లైఓవర్, దుర్గం చెరువు తీగల వంతెన, సైబర్ టవర్ ఫ్లైఓవర్, ఫోరం మాల్ ఫ్లైఓర్, జేఎన్‌టియు ఫ్లైఓర్, ఖైత్లాపూర్ పై వంతెన, బాలానగర్ బాబుజగ్జీవన్‌రామ్ ఫ్లైఓవర్‌లపైకి ఆసమయంలో వాహనాలు అనుమతించరు. అలాగే క్యాబ్, ట్యాక్సీలు, ఆటోడ్రైవర్లు, ప్రజలను ప్రయాణికులను నిరాకరించకూడదని పోలీసులు సూచించారు. నిరాకరించే డ్రైవర్లు వాహనాల నంబర్, సమయం తదితర వివరాలతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 'డ్రగ్స్ డిటెక్షన్ టెస్ట్ కిట్స్'

హైదరాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త : న్యూ ఇయర్ వేళ నార్కోటిక్ పోలీసులు రంగంలోకి దిగాయి. అత్యాధునిక టెక్నాలజీతో డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో డ్రగ్స్ డిటెక్షన్ టెస్ట్ కిట్స్‌ను రంగంలోకి దించింది నార్కోటిక్ టీమ్. ఆదివారం నుంచి పరీక్షలు చేయడానికి నార్కోటిక్ బ్యూరో సన్నద్ధమైంది. ఈ మేరకు తెలంగాణ నార్కోటిక్ బ్యూరోకు కొత్త పరికరాలు చేరాయి. లాలాజలంతో పాటు అవసరమైతే మూత్ర పరీక్షలను అధికారులు పరీక్షలు చేయనున్నారు. బ్రీత్ అనలైజర్ టెస్ట్ రాగానే అప్పటికప్పుడే డ్రగ్స్ తీసుకుంటే పాజిటీవ్ రిపోర్టు వచ్చే అవకాశం ఉంది. పాజిటివ్ రిపోర్టు రాగానే మరిన్ని పరీక్షల కోసం మూత్ర పరీక్షలను అధికారులు చేయనున్నారు. రెండింటిలోనూ పాజిటివ్ రిపోర్టు వస్తే సదరు వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకోనున్నారు. డ్రగ్స్ తీసుకున్న మూడు రోజుల తర్వాత కూడా రక్త, మూత్ర పరీక్షల్లో వ్యవహారం బయటపడనుంది. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగం అరికట్టడమే లక్ష్యం అని నార్కోటిక్ బ్యూరో పేర్కొంటుంది. ఒక్కో కమిషనరేట్‌కు 25 చొప్పున డ్రగ్ డిటెక్షన్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ట్రై కమిషనరేట్ పరిధిలో జంక్షన్ల వద్ద డ్రగ్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. డ్రగ్ డిటెక్షన్ పరీక్షలపై పోలీసులకు ఇప్పటికే శిక్షణ పూర్తి అయింది. ఇక పరీక్షలను ముమ్మరంగా నిర్వహించనున్నారు.

## విద్యార్థులు లేకున్నా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ టీచర్

కంటోన్మెంట్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక పోయినా టీచర్ విధులు నిర్వహిస్తుంది. బస్తీలో 800పై చిలుకూ కుటుంబాలు ఉన్నాయి. అందులో నివసించే వారంతా కూలీ,నాలీ చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. కోట్లాధి రూపాయల వ్యయంతో 3 అంతస్థుల భవనాన్ని బస్తీలో నెలకొల్పింది. పాఠశాలకు ఒక్క విద్యార్థికూడా రాకపోవడం గమనార్హం. శనివారం ఉదయం ప్రభాత వార్త విలేకరి పాఠశాలను సందర్శించగా జమీమా అనే టీచర్ విద్యార్థులు లేకుండా విధులు నిర్వహిస్తుంది. ఈ పాఠశాలకు రెగ్యులర్‌గా విధులు నిర్వహించే టీచర్ సెలవులో ఉన్నందు వల్ల ఆమె స్థానంలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించగా 1వ తరగతిలో 8 మంది, 2వ తరగతిలో 5 మంది, 3వ తరగతి లో 5 గురు విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నట్లు హాజరు పట్టి కలో పేర్లు పొందుపర్చాయి.



రైల్ నిలయం అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకున్నా విధులు నిర్వహిస్తున్న టీచర్

**విద్యార్థులు ఎవరు లేక పోయినా కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం..** పాఠశాల భవనంలోని పక్క గదిలో అంగన్‌వాడీ కేంద్రం సజావుగానే కొనసాగుతుంది. అంగన్ వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలలోపు ఉన్న 15 మందిచిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంకు హాజరైయ్యారు.



## కనిపిస్తే.. కరుస్తున్నాయ్!

వీధికుక్కలు వీర విహారం సృష్టిస్తున్నాయి. మొన్నటికి మొన్న వీధి కుక్కల దాడిలో ఓ పసిబాలుడు మృతి చెందగా, అంతకు ముందు అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడు కుక్కల దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. అంతేకాకుండా..కొన్ని చోట్ల మనుషులపై ఎగబడి దాడికి పాల్పడుతున్నాయి. జంటనగరాల్లో కుక్క కాటు కేసులు విపరీతంగా పెరుడుతున్నాయి. కేవలం ఫీవర్ ఆస్పత్రిలో డిసెంబరు నెలలో 2,442 కేసులు నమోదయ్యాయి. దాదాపుగా రోజుకి 80 నుంచి 100 కేసులు నమోదవుతున్నట్లు అధికారుల చెబుతున్నారు. అంతేకాకుండా కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి సోకితే మరణం తప్పదు. రేబిస్‌కి చికిత్స లేదు. అయితే ఫీవర్ ఆస్పత్రిలో వారానికి రెండు రేబిస్ కేసులు నమోదు అవుతున్నాయి. వీధి కుక్కల వల్ల ఎక్కువగా కుక్కకాటుకు గురవుతున్నారు. జనాల్లో కుక్కకాటుకు వ్యాక్సిన్ ఉందనే అవగావాన లేకపోవడమే మరణాలు సంభవిస్తున్నాయని అంటున్నారు వైద్యులు. నగరంలో రేబిస్ వార్డు కేవలం ఫీవర్ ఆస్పత్రిలో ఉంది. ఇక్కడ ఎప్పటికీ రేబిస్ పేషంట్స్ అడ్మిషన్ జరుగుతూనే ఉన్నాయి.

### ఆగని కుక్కల దాడులు ▲ డిసెంబరులో 28 రోజుల్లో 2442 కేసులు

హైదరాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త : ఇది రేబిస్ వ్యాధికి దారితీస్తుంది. చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. వీధికుక్కల బెడదను నియంత్రించడంలో ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు అమలు చేయడంలో విఫలమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తుంటాయి.కుక్కల నియంత్రణకు జిమెచ్ఎంసి శ్వాత పరిష్కార చర్యలు చేపడుతోన్న దాఖలాలు లేవు. కుక్కల సంఖ్య తగ్గించేందుకు కీలకమైన బర్త్ కంట్రోల్ ఆపరేషన్లలో అదే ఆలసత్వం కనిపిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం గ్రేటర్‌లో 5.75లక్షల కుక్కలుండగా.. కనీసం 50 శాతం స్టెరిలైజేషన్ కూడా జరగలేదు. యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ జరిగిన కుక్కల సంఖ్య ఇంచుమించుగా అంతే ఉంటుంది. కుక్కలకు సంబంధించిన నియంత్రణ ఒక్కటే మార్గం. కానీ ఆ నియంత్రణ సక్రమంగా లేకపోవడంతో ఈ సమస్య ఎదురవుతుంది. కుక్కల నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నామంటూ భారీగా లెక్కలు చెప్తూ నిధులను ఖర్చు చేస్తున్నారు. కానీ ఫలితం లేదు. ముఖ్యంగా వీటి ప్రత్యేకమైక లెక్కలంటూ లేకపోవడం, ప్రశ్నించే పరిస్థితి లేకపోవడంతో నిధులు భారీగా ఖర్చు అవుతున్నాయి. జిహెచ్ఎంసి పరిధిలో కుక్కలను పట్టు కోవడం, వాటికి శస్త్ర చికిత్సలు చేయడం కోసం పెద్ద యంత్రాంగం ఉంది. దీనికి కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించడంతో పాటు కుక్కలను నియంత్రించేందుకు ప్రతి సర్కిల్‌లో వెటర్నరీ అధికారితో పాటు సిబ్బంది సైతం ఉన్నారు. ఫోన్ చేసిన తరువాత వచ్చి కుక్కలను పట్టుకుని వెళ్లేవారు, కానీ ఇప్పుడు ఎస్ఎంఎస్ పంపుతున్నారు. వాస్తవంగా మాత్రం ఒక్క కుక్కను పట్టుకున్న సంఘటన గానీ, నియంత్రణ చేసిన సంఘటనలు గానీ కనిపించడం లేదు. అయితే ఈ వీధి కుక్కలను పట్టుకోవడం, వారికి ఆపరేషన్లు, మందులు, వారం రోజుల పాటు ఆహారం, ఇలా అన్నింటికి కలిపి భారీగానే నిధులను జిహెచ్ఎంసి వెచ్చిస్తుంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో కలిపి 75వేలకు పైగా కుక్కకాట్లు నమోదు అవుతున్నాయి. అంటే ప్రతి 100మందిలో ఒకరు కుక్కకాటుకు గురౌతున్నారు. ప్రతి యేడాది ఈ కాటుగురయ్యేవారితో పాటు మృత్యువాత పడేవారి సంఖ్య కూడా పెరుగుతుంది. అధికారుల లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం సరాసరి 50వేలు మాత్రమేనంటున్నారు. కానీ ప్రైవేటు ఆసుపత్రులలో 20-30వేల వరకు నమోదును లెక్కలోకి తీసుకోవడం లేదు. వెటర్నరీ విభాగంలో అవినీతి పెరిగిపోవడంతో కుక్కల నిధుల నీళ్లల ఖర్చు అవుతున్నాయి, మరోవైపు సామాన్య ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.



## 6 గ్యారంటీల అమలుపై స్పష్టత ఇవ్వాలి : ఎమ్మెల్యే తలసాని

కంటోన్మెంట్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టం చేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులలో అర్హులను ఎప్పటిలోగా ఎంపిక చేస్తారని ప్రకటించాలన్నారు. అదే విధంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నిర్ధిష్టమైన ఫారాలను ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. 6 గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటస్పందించి దరఖాస్తుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం చేపట్టబోయే పథకాలు, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకు ఎల్లప్పుడు సహకరిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా అమలు చేయాలన్నారు.

## ప్రజాపాలనను పరిశీలించిన జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాస్



చిక్కడపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం తీరును శనివారం జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాజ్ చిక్కడపల్లి వార్డు కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తులు చేసుకోవడానికి కేంద్రం ఆవరణలో వేచి ఉన్న ప్రజలను కార్యక్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకుని సలహాలను, సూచనలను స్వీకరించారు.



డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు వినతిపత్రాన్ని అందజేస్తున్న జేఏసీ కమిటీ నాయకులు

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకి ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి టైం స్కేల్ ఇవ్వాలి

హైదరాబాద్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకి ఏజెన్సీ విదానాన్ని రద్దు చేసి టైం స్కేల్ ఇవ్వాలని కోరుతూ డీప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు శనివవారం తెలంగాణ జేఏసీ కమిటీ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగాణ తెలంగాణ జేఏసీ కమిటీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్యయ్య పులి, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ బొల్లం, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చినా మా జీవితాలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేస్తున్న ఉద్యోగులందరికి హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, మరణించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 10లక్షల ఆర్థిక సహాయం చేస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి ఒక్క ఉద్యోగికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ మినిమం టైం స్కేల్ ఇస్తూ క్రమబద్ధీకరించాలని ఉపముఖ్య మంత్రి భట్టివిక్రమార్కకు వినతిపత్రాన్ని సమర్పించినట్లు వారు పేర్కొన్నారు.

### మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు ప్రారంభం

చిక్కడపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త: రామ్‌నగర్ డివిజన్‌లోని హరినగర్‌లో ధ్వంసమైన మ్యాన్‌హోల్ మరమ్మత్తు పనులను బిఆర్ఎస్ సీనియర్ నేత సిరిగిరి శ్యామ్ చొరవతో సంబంధిత అధికారులు స్పందించి శనివారం వెంటనే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు రాకం సత్యనారాయణ పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి ఉట్టిపడిన జాతీయ నృత్యపోటీల వేడుకలు



పోటీ విజేతలతో చిన్నారులు, అతిథులు

నాంపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా ఆల్ ఇండియా 11వ కల్చరల్ నేషనల్ డ్యాన్స్ కాంటెస్ట్, ఫెస్టివల్ భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో వైభవోపేతంగా జరిగాయి. అకిల్ నట్రాజమ్ అంతర్ సంస్కృతిక్ సంగం నాగపూర్ ఆధ్వర్యంలో సంస్థ విద్యార్థులు హాయతి, అనిక, శ్రీయేష్, భవిష్య, తనిష్క, అక్షిత, వివేక్ జూనియర్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ ఫ్లై డ్యాన్స్ స్టూడియోస్ ఈ పోటీల్లో పాల్గొని మొదటి, రెండవ, జ్యూరీ అవార్డులను కైవసం చేసుకుని సంస్థ పేరుప్రఖ్యాతులను, తెలంగాణ వైభవాన్ని వెల్లివిరిసేలా అద్భుత ప్రదర్శనలతో అలరించి ప్రేక్షకులను ప్రశంసలు, శుభాభినందనలు పొంది తమకుతామే సాటని నిరూపించుకొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు.

# ముగిసిన తెలంగాణ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్

**విజేతగా నిలిచిన లాహిరి కొమరవెల్లి**



విజేతలకు టోర్నీకప్ అందజేస్తున్న శైలజారామయ్యర్, సుహేమ్ షేక్

హైదరాబాద్, డిసెంబరు 30,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ రెగట్టా టోర్నమెంట్‌లో లాహిరి కొమరవెల్లి విజేతగా నిలిచింది. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో శనివారం ముగిసిన టోర్నిలో లాహిరి సబ్‌జూనియర్ విభాగంలో స్వర్ణం సొంతం చేసుకోగా..ఆమె అక్కడ దీక్షిత కొమరవెల్లి రెండోస్థానంతో రజతం సాధించింది. మూడు రోజుల పోటీల్లో అదరగొట్టిన ఈఅక్కాచెల్లెల్లు చెరో 15 పాయింట్లతో సమంగా నిలిచారు. కానీ తక్కువ వయస్సు,బరువు ఉనన లాహిరి 5రేసులను గెలుచుకోగా ,దీక్షిత 4రేసులు మాత్రమే నెగ్గింది. శుక్రవారం వరకు దీక్షిత ఒక పాయింట్‌తో అధిత్యంలో ఉంది. 9వ రేస్‌లో తన సోదరిని నిలువరించింది. కానీ పదోరేసులో నిరాశపరిచి మూడో స్థానానికి పడిపోయింది. దాంతో లాహిరి స్వర్ణానికి చేరువైంది. అలాగే సబ్‌బాలుర విభాగాల్లో బన్నీ బొంగూరు ,దినోద్‌దండు, రిజ్వాన్ మహ్మద్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కానీ ఓవరాల్ పాయింట్లలో బాలికల కంటే వనకబడ్డారు. ఫ్లీట్స్ ఇరు వయోవిభాగాల్లో బాలికలు సబ్‌జూనియర్ ,జూనియర్ ఛాంపియన్ షిప్‌లలో అబ్బాయిలను వెనక్కినెట్టి పతకాలు గెలుపొందారు. జూనియర్ బాలికల విభాగంలో ఝాన్సీప్రియా లావేటి 8పాయింట్లతో స్వర్ణ పథకాన్ని గెలిచింది.

## నామినేటేడ్ పదవులలో అసలైన క్రైస్తవులకు కేటాయించాలి: టిసిసి విజ్ఞప్తి

సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త: రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే నామినేటేడ్ ఎంఎల్‌సి, డైరెక్టర్స్ తదితర పదవులు క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయులను గుర్తించి తగు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. ఒక వైపు రిజర్వేషన్‌లు పొందుతూ, మరొకవైపు క్రైస్తవ మతంలో కొనసాగుతూ మోసం చేస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, నిజమైన అసలైన క్రైస్తవులకు మాత్రమే పదవులు కేటాయించాలని కౌన్సిల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముల్కల ప్రవీణ్, ఎస్.సన్నీ ఎడ్వర్డ్, ఉపాధ్యక్షుడు పెద్దెల్లి డెవిడ్, మహిళా విభాగం అధ్యక్షురాల జి.షీబా తదితరులు మాట్లాడుతూ తమ కౌన్సిల్ ఆధ్వర్యంలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆనేక మంది క్రైస్తవులు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం అహర్నిషలు కృషి చేశారని గుర్తు చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం క్రైస్తవులకు చేసిన అన్యాయాలను, కాంగ్రెస్ పార్టీ చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసి విజయం కోసం ఎంతో కృషి చేశామని వారు వివరించారు. కొంత మంది క్రైస్తవుల కాంగ్రెస్ పార్టీ దగ్గర డబ్బులు తీసుకుని మోసం చేశారని ఆరోపించారు. నామినేటేడ్ పదవుల విషయంలో సిఎం ఎ.రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు

## ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణి

సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త: దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, ఉన్నత విద్యను అభ్యసించిన వారు తిరిగి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాలని ముత్తూట్ గ్రూప్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జోనల్ మేనేజర్ జితేందర్‌కుమార్, రీజినల్ మేనేజర్ కె.వి.మురళి, హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ చెప్పారు. విద్య ద్వారానే విజ్ఞానం, విజ్ఞానం ద్వారానే ప్రపంచం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. ముత్తూట్ గ్రూప్ సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా హిమాయత్‌నగర్‌లోని ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ కార్యాలయంలో ప్రతిభావంతులైన 7 గురు నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసిన సందర్భంగా వారు మాట్లాడారు. తమ సంస్థ ద్వారా స్కాలర్‌షిప్‌లు పొంది ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. మెడికల్, ఇంజనీరింగ్, బిఎస్సీ, నర్సింగ్ కోర్సులు చదివే విద్యార్థులకు వారు స్కాలర్‌షిప్‌ల చెక్కులు అందజేశారు. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వి.శ్రీలక్ష్మి, కౌశిక్‌సింగ్, దీపిక, అజ్మలకు 2,40,000, బిటెక్ విద్యార్థులు స్నేహిత, చరణ్, పెట్టెం ఆదర్శణిలకు 1,20,00 రూపాయల స్కాలర్‌షిప్‌ల చెక్కులను వారికి తల్లిదండ్రుల సమక్షంలో అందించారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ అధికారులుగోలి రోజా, లక్ష్మీనారాయణయమగాని తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 2 నుంచి సనత్‌నగర్ నియోజకవర్గంలో పాదయాత్ర

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: సనత్ నగర్ నియోజకవర్గంలోని 6 డివిజన్లలోని బస్తీలు, కాలనీల్లో వచ్చే నెల 2 నుంచి పర్యటించి అభివృద్ధి పనులను చేపట్టేందుకు శ్రీకారం చుడుతామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.శనివారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ జనవరి 2 నుంచి డివిజన్ల వారిగా పాదయాత్రలు జరిపి కోట్లాధి రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. 2వ తేదీన బన్సీలాల్‌పేట్ డివిజన్, 3న రాంగోపాల్‌పేట్ డివిజన్, 4న సనత్ నగర్ డివిజన్లలో పర్యటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కొలను లక్ష్మిబాల్ రెడ్డి, మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, ఉప్పల తరుణి, బిఆర్‌ఎస్ నేతలు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఆకుల హరిక్రిష్ణ, బాల్ రెడ్డి, వెంకటేశ్‌రాజు, హన్మంత్ రావ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు కార్యాలయాల్లో కౌంటర్లు పెంచాలి

**కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ**



దరఖాస్తు కౌంటర్లను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

ముషీరాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త: దరఖాస్తుదారుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వార్డు కార్యాలయాల్లో ప్రజాపాలన కౌంటర్లు పెంచాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ సూచించారు. ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ అభయహస్తం ఐదు గ్యారంటీల కోసం శనివారం కవాడిగూడలో ఏర్పాటుచేసిన నాలుగు సెంటర్లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాళ్లబస్తీ కమ్యూనిటీహాల్, ముగ్గుబస్తీ అంగన్‌వాడీ కేంద్రం, బండమైసమ్మ కమ్యూనిటీహాల్, దోమలగూడ వార్డు కార్యాలయాలలో ప్రజా పాలన కేంద్రాలు ఏర్పాటుచేశారని, ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవటానికి తరలి వస్తున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకటేష్, పరిమళకుమార్, నాగరాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర, ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



వాహన దొంగను పట్టుకున్న దోమలగూడ పోలీసులు

ముషీరాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త: ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న దొంగను దోమలగూడ పోలీసులు చాకచెక్యంగా అరెస్ట్ చేశారు. దోమలగూడ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం దోమలగూడలోని గౌడ హాస్టల్ వద్ద భిక్షాటన చేసుకునే దాసరి శ్యాం అలియాస్ నర్సింగ్ (45) ఇటీవల దోమలగూడలోని వైన్స్ వెనక గోడకు రంధ్రం చేసి షాపు యజమాని బైకు తాళాన్ని దొంగిలించి, బైకుతో పరారయ్యాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దోమలగూడ పోలీసులు చాకచక్యంగా శ్యాం ను పట్టుకుని విచారించగా దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు బైకులు, ఒక యాక్టివా దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. శ్యాం దొంగిలించిన వాహనాల విలువ దాదాపు మూడు లక్షలకు పైగా ఉంటుందని, గత ఆరు సంవత్సరాలుగా నిందితుడు వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. డీసీపీ మరియు ఏసీపీల ఆదేశాలతో డీఐ ఎం.వరప్రసాద్, ఎస్ఐ గిరి శ్రీకాంత్‌లతో కలసి నిందితుడిని పట్టుకోవటం జరిగిందని వివరించారు.

## మంత్రి పొన్నంను సన్మానించిన టిఎన్‌జిఓ నాయకులు



గన్‌ఫౌండ్రి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా అద్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేని,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, ఉస్మాన్‌అలీతో కలిసి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దుర్రిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు.జనవరి 4వ తేదిన టిఎన్‌జిఓ ఆద్వర్యంలో జరిగే 9వ క్రికెట్ పోటిలకు ఆహ్వానించారు. ప్రతి యేటా మాదిరిగానే ఈ యేడు కూడా ఆటపోటిలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఉద్యోగుల పని ఒత్తిడి అధికమించడానికి ఉద్యోగుల మధ్య ఆటపోటిలు నిర్వహించాలన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న కౌన్సిల్ సభ్యులు

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి: చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ

దుండిగల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పురపాలకసంఘం సాదరణ సర్వసభ్య సమావేశం శనివారం చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పురపాలిక పరిధిలో రూ,545.50లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆయా వార్డుల పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రణాళిక బద్దంగా నాణ్యతో పూర్తి చేయాలన్నారు. పలువురు సభ్యులు కోరిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం హాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్యే వివేకానంద్‌ను కౌన్సిల్ సభ్యులందరూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కమీషనర్ సత్యనారాయణ, తహసీల్దార్ సుచరిత, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## కెపిహెచ్‌బి కాలనీలో మహా పడిపూజ



అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 30, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెంబర్ 3 శివాలయం దేవాలయ ప్రాంగణంలో జరిగిన శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ నార్నె శ్రీనివాసరావు, అయ్యప్ప స్వాములు భక్తులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న అరికెపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుబ్బారావు, గుమ్మడి శ్రీనివాస్, రాధాకృష్ణ, నర్సింహారావు, ఎర్రబెల్లి సతీష్, యుగంధర్, మధు, హర్ష, మురళి తదితరులు పాల్గొన్నారు.

## పైప్ లైన్ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త: నూతన డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను అంబర్‌పేట ఎమ్మెల్యే నల్లకుంట కార్పోరేటర్ అమృతతో కలసి ప్రారంభించారు. శనివారం నల్లకుంట డివిజన్ లోని తిలక్‌నగర్, సంజయ్‌నగర్‌లో డ్రైనేజ్ పైప్‌లైన్ నిమిత్తం 11 లక్షల బడ్జెట్ నిధులు మంజూరైన సందర్భంగా వారు పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చేపట్టిన పనులను వేగవంతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలు, వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## అదనపు ప్రజాపాలన సెంటర్‌ను ఏర్పాటు చేయాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 30, ప్రభాతవార్త : అల్లాపూర్ డివిజన్ కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమీషనర్ రమేష్‌కు కార్పోరేటర్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దరఖాస్తు స్వీకరణ సెంటర్లను అదనంగా రాజీవ్‌గాంధీ నగర్, సబ్దర్ నగర్, యూసుఫ్‌నగర్‌లలో సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మూడు బస్తీలలో అర్హులైన పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువ మోతాదులో నివసిస్తున్నారని సెంటర్ ఏర్పర్చడం వలన ఈ మూడు బస్తీలలో నివసిస్తున్న ప్రజలకు అర్కే సొసైటీలో ఉన్న సెంటర్ చాలా దూరం కావడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండే విధంగా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి వార్షికోత్సవం



అయ్యప్ప స్వామి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 30, ప్రభాతవార్త : కూకట్‌పల్లి వివేకానందనగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం వారి 32వ వార్షిక పూజా మహోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ చైర్మన్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పూజారులచే ఉదయం లక్ష్మీ గణపతి హోమం, గోమాత పూజా కార్యక్రమం అనంతరం అష్టోత్తర కలశాభిషేకం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొని కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ హరిహర పుత్రుని కృప అందరిపై ఉండాలని కోరినట్లు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అలాగే సాయంత్రం 6గంటలకు కూకట్‌పల్లి పురవీధుల్లో అయ్యప్ప స్వామి ఊరేగింపు అత్యంత వైభవంగా జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వద్దేపల్లి రాజేశ్వరారవు కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల దరఖాస్తులను ఉచితంగా అందజేస్తాము : ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



దరఖాస్తులను ఉచితంగా అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, డిసెంబర్ 30 ప్రభాతవార్తః రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీల పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన వారికి అవకాశం కల్పించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ సూచించారు. ప్రజలు దర ఖాస్తు పత్రాలను దాఖలు చేసేందుకు ఇబ్బంది పడకుం డా తమ కార్యాలయం ద్వారా ఉచితంగా ప్రజలకు దరఖాస్తులను సమకూర్చుతామని ఆయన తెలిపారు. గ్యారెంటీల దరఖాస్తులను స్వీకరణ ప్రక్రియపై పద్మారావు గౌడ్ శనివారం తన కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉపకరించే దరఖాస్తు పత్రాలను కూడా కొందరు డబ్బులకు విక్రహించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీలోని ఐదు మున్సిపల్ డివిజన్‌లకు సబంధించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడకుండా అధికారులు సహకరించాలని పద్మారావు గౌడ్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, ఇతర అధికారులను ఆదేశించారు. తమ కార్యాలయం ద్వారా కూడా ఉచితంగా ప్రజలకు దరఖాస్తులు అందిస్తామని తెలిపారు. దరఖాస్తులను పూర్తి చేసేందుకు నియోజకవర్గం లోని తమ పార్టీకి చెందిన నేతలు తమవంతు తోడ్పాటును అందించాలని పద్మారావు గౌడ్ సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనలో కారు డ్రైవర్ అరెస్టు

మలక్‌పేట్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: రోడ్డు పై నడుడుకుంటు వెళ్లుతున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనలో ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్‌ను అరెస్టు చేసిన సంఘటన ఛాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రమాదంలో మరణించిన యువకుడి వివరాలు చాలా ఆలస్యంగా తెలిసిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన యువకుడు శ్రవణ్‌కుమార్(24) గా గుర్తించిన పోలీసులు మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. యువకుడి మృతికి కారకుడైన వారి కోసం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు నిర్వహించి వాహనం వివరాలను సేకరించగా స్నేహితులతో కలిసి కారులో ప్రయానిస్తున్న వ్యక్తి శ్రవన్‌కుమార్‌ను ఢీకోట్టారని నిర్ధారించి కారునడిపిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇన్స్‌పెక్టర్ ప్రకాష్ రెడ్డి కథనం ప్రకారం. మలక్‌పేట్‌కు చెందిన శ్రవన్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 6న రాత్రి మలక్‌పేట్ నల్గొండ చౌరస్తా ప్రాంతంలో నడుకుంటూ వెళ్లుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను తీవ్రగాయాలకు గురైన అతనిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతను ఈ నెల 8న మరణించాడు. దీంతో మృత దేహాన్నిమార్చురీలో బధ్రపరిచి మృతుడి వివరాలను సేకరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 13 వతేదిన మృతుడి కుటుంబ సభ్యులు తమ కుమారుడు శ్రవణ్‌కుమార్ ఈ నెల 7వ తేది నుంచి కనిపించడంలేదని పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు శ్రవన్‌కుమార్ అయి ఉండవచ్చునని పోలీసులు భావించి కుటుంభ సభ్యులకు తెలియజేయడంతో వారు మృతదేహాన్ని గుర్తించారు. దీంతో పోలీసులు వారికి మృతదేహాన్ని అందజేశారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు ముమ్మరంగా ధర్యాప్తు చేపట్టారు.ఇన్స్‌పెక్టర్ ప్రకాష్ రెడ్డి ఆద్వర్యంలో ఐదు పోలీస్ టీంలను ఏర్పాటు చేసి వాహనం ఆచూకి కోసం చర్యలు తీసుకున్నారు. సీసీపుటేజీలో వాహనం నెంబర్ కనిపించకపోవడంతో సాకేంతిక పరిజ్ఞానంతో ప్రమాదానికి కారకుడైన కారు నడుపుతున్న నాగోల్‌కు చెందిన బి.సూర్యప్రకాష్ రెడ్డి గా నిర్ధారించి శనివారం అతినిని అరెస్టు చేశారు. కాగా ఈ నెల 6న ఎల్‌బీనగర్ నుంచి స్నేహితులతో కలిసి తన కారులో మదినా వద్ద గల ఓ హోటల్‌కు భోజనం చేసేందుకు వెళ్లుతుండగా మలక్‌పేట్ నల్గొండ చౌరస్తావద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లుతున్న శ్రవన్‌కుమార్‌ను ఢీకొట్టివెళ్లి పోయారు. అనంతరం హోటలకు వెళ్లకుండా చాందర్‌ఘాట్ మీదుగా ఎల్‌బీనగర్‌కు వెళ్లిపోయారు. తన సిబ్బందితో కలిసి ఇన్స్‌పెక్టర్ ప్రకాష్ రెడ్డి ధర్యాప్తు చేసి నిందితుడు సూర్యప్రకాష్ రెడ్డిని అరెస్టు చేసి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా మహాపడి పూజ

అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 30ప్రభాతవార్త: స్వామి వివేకనందనగర్ అమ్మవారి ద్వారం వద్ద జరిగిన అయ్యప్పస్వామి మహాపడి వైభవంగా జరిగింది. ఈపూజల్లో అయ్యప్పస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మహాపడి పూజలను సంతోషచార్యులు నిర్వహించారు. పేటతుల్లి తరహాల్లో స్వామి అభరణాలను భ్యాండ్ మేళాల మధ్య తీసుకు వచ్చారు. మొదటిసారి మాల ధరించిన కన్నెస్వామి దండు నర్సింహా, నరేష్‌లు మహాపడి పూజకు ముందు తమ తల్లిదండ్రులను శాలువ కప్పి ఘనంగా సన్మానించి ఆశ్వీరవచనాలను తీసుకున్నారు. ఈకార్యక్రమంలో అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట

సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త: అయోధ్యలో జనవరి 22వ తేదీన శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో 'జన సంపర్క్ అభియాన్' నిర్వహించడం జరుగుతుందని శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ బాధ్యులు, విహెచ్‌పి ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విహెచ్‌పి ప్రతినిధులు పండరినాథ్, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింహామూర్తి, జగదీశ్వర్ తదితరులు మాట్లాడుతూ ఈ అభియాన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికి అయోధ్యలో పూజించిన అక్షింతలు అయోధ్య మందిర చిత్రపటం, మందిర్ నమూన కరపత్రం చేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 12 వేల గ్రామాల్లో అక్షింతలు పంపిణి చేస్తున్నామన్నారు. 22న మధ్యాహ్నం 12.30 అయోధ్యలో జరిగే విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవాన్ని టివిల్లో ప్రతి ఒక్కరూ వీక్షించాలని చెప్పారు.

## వాహన దారులు తప్పకుండ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**రాజేంద్రనగర్ ఎసిపి మురళి కృష్ణ**



మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 30 ప్రభాతవార్త : నూతన సంవతర్సం సందర్భంగా ఈ నెల 31వ తేదీ ఆదివారం రాత్రి ప్రజలు తప్పకుండ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎసిపి పి.మురళీకృష్ణ అన్నారు. రాజేంద్రనగర్ ఎసిపి మురళీకృష్ణ శనివారం ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు అర్ధరాత్రి దాటిన తర్వాత అతి వేగంగా ప్రయాణం చేయరాదని,సురక్షితమైన ప్రయాణం కోసం వాహనదారులు తప్పకుండ హెల్మెట్‌ను ధరించాలని,డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా జరుగుతాయని తెలిపారు.డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి పది వేల రూపాయల వరకు జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు.రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే,ఓఆర్ఆర్ హిమాయత్ సాగర్ టోల్ ప్లాజా ప్రాంతాలలో ఆదివారం రాత్రి ఎనిమిది గంటలు నుంచి సోమవారం ఉదయం ఆరు గంటలకు వాహనాలను అనుమతించటం లేదని ఆయన తెలిపారు.

## కుల గణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జనాభాలో కుల గణన నిర్వహించి, స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్‌ల శాతాన్ని 42కు పెంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇందుకోసం జనవరి 5 తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, లక్ష మంది బిసిలతో 'చలో హైదరాబాద్' ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ నాగపూర్‌లో జనాభాలో కులగణన చేపడతామని, రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో జనాభాలో కుల గణన చేపడతామని, స్థానిక సంస్థలలో బిసిలకు రిజర్వేషన్‌ల శాతాన్ని 42 శాతంకు పెంచుతామని పేర్కొందని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కుందారం గణేషాచారి, చిన్న శ్రీశైలంయాదవ్, విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అధికారులతో విస్తృత స్థాయి సమావేశం

**తలకొండపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఏఐసిసి సభ్యులు వంశీచందర్‌రెడ్డితో కలిసి తలకొండపల్లి మండలం రామకృష్ణపురం ఆంజేయస్వామి ఆలయం లో ప్రత్యేకంగా నిర్వహించిన యజ్ఞంలో పాల్గొన్నారు. తదుపరి ఖనాపూర్‌లోని తమ నివాసంలో నియోజకవర్గ అన్ని మండలాలకు సంబంధించి పంచాయతీరాజ్, రోడ్లు మరియు భవనాలు పూర్తి కావా ల్సిన బిటిరోడ్లు, భవనాలు మరియు అవసరమైన కొత్త బిటీ రోడ్లకు సంబంధించి సంబంధిత అధికారులతో ఎస్ఇ, ఈఈ,డిఈ మరియు ఏఈలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే బిజెపి లక్ష్యం

**మర్పల్లి డిసెంబర్ 30 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమమే బీజేపి లక్ష్యమని బీజేపి జిల్లా కార్యవర్గ సభ్యులు బలరాంగౌడ్ అన్నారు. మండలంలోని కోటమర్పల్లి గ్రామంలో శనివారం నాడు వికసిత్ భారత్ విజయ సంకల్ప యాత్రలో రైతులకు యువజన సంగాల నాయకులకు బీజేపి ప్రభుత్వం నరేంద్రమోడి అందిస్తున్న పలు సంక్షేమపథకాలను వివరించారు. విశ్వకర్మ పథకంలో ప్రతి కుల నాయకులకు లక్ష రూపాయల నుండి మూడు లక్షలలోనుఐదు పైసల వడ్డీకి అందించాలని మేనేజర్‌ను కోరారు. ఈకార్యక్రమంలో మర్పల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ గ్రామ పంచాయితీకి చెందిన వివిద అధికారులు, గ్రామసర్పంచ్ విజయలక్ష్మి, రాచన్న, రఘుపతిరెడ్డి ,మల్లారెడ్డి వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డిసంతోష్‌రెడ్డి మదుకర్ రాచన్న పాల్గొన్నారు.

## రంగ నాయక స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి : చైర్మన్



యంనంపేట్ శ్రీ భూనీళ సమేత రంగనాయక స్వామి వారి వల్లకిసేవలో పాల్గొని పూజలు చేసిన చైర్మన్ కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 30, ప్రభాత వార్త:** యంనంపేట్ శ్రీ భూనీళ సమేత రంగనాయక స్వామి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు తమ వంతు సహకారం అందించాలని చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ యంనంపేట్‌లోని శ్రీ భూనీళ సమేత రంగనాయక స్వామి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పల్లకిసేవా, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. నిర్వహకులు స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు అన్నదానం చేసిన ఉప్పునూరి అంజలి వారి కుటుంబ సభ్యులను చైర్మన్ శాలువా కప్పి సత్కరించారు. నాయకులు పోలగోని రాజేశ్ గౌడ్, చంద్రారెడ్డి, పాలకూర వెంకటస్వామి, సగ్గు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

**న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్సై**

**కోట్‌పల్లి, డిసెంబరు 30, ప్రభాతవార్త;** న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకో వాలని కోట్‌పల్లి ఎస్సై స్రవంతి అన్నారు. శనివారం అమె మాట్లాడారు. న్యూ ఇయర్ వేడుకలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ పోలీసులు సూచనలు పాటించాలన్నారు. మధ్యం వైన్ షాప్స్, యాజమానులు ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలన్నారు. ఈనెల 31,న రాత్రి 10, గంటల నుంచి స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తామని మధ్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అమె హెచ్చరించారు.

## మిర్జాగూడలో నమోదైన బోగస్ ఓట్లపై చర్యలు తీసుకోవాలి

**శంకర్‌పల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ గ్రామంలో నమోదైన బోగస్, నకిలీ ఓట్లను తొలగించాలని, వాటిని నమోదు చేసిన, చేయించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన పలువురు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, శంకర్‌పల్లి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. మిర్జాగూడ గ్రామంలోని 112, 113, 114, 115 వార్డుల్లో బోగస్, నకిలీ ఓటర్లను చేర్పించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ సంజీవ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒగ్గు మల్లేష్, నర్సింగ్, పురం శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు కలెక్టర్, డిప్యూటీ తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. రాను న్న పంచాయతీ ఎన్నికల్లో దురుద్దేశ్యపూర్వకంగా లబ్ది పొందేందుకు, బోగస్ ఓట్లను ఎక్కువగా చూపి మున్సిపాలిటీగా సృష్టిం చాలనే ఉద్దేశ్యంతో ఓట్లనుఓ పథకం ప్రకారం పెంచుతు న్నారని వారు అధికారుల దృష్టికి తెచ్చారు. ఒరిజినల్‌గా 2500 ఓట్లు ఉండగా, 2014 నుంచి 2023 వరకు 3999 ఓట్లకు పెంచారని, కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 2700 ఓట్లు మాత్రమే పోలయ్యాయని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా 114 వార్డులో అతి తక్కువ ఓట్లు పోలయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఓటర్ల సంఖ్య ఆరు వేలకు పెరిగిందని అన్నారు. ఓ పథకం ప్రకారం ఇలా ఓట్లను బోగస్‌గా చేర్పించిన, చేరిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని కోరారు.

## ఘనంగా న్యూఇయర్ వేడుకలు



పాఠశాలలో న్యూఇయర్ వేడుకలు జరుపుకుంటున్న చిన్నారులు

**నందిగామ డిసెంబరు30,ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం విద్యార్థులు 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ న్యూ ఇయర్ వేడుకల ను జరుపుకున్నారు. పాఠశాలలో 2023కు వీడ్కోలు పలుకుతూ 2024సంవత్సరానికి స్వాగతం పలికి న్యూ ఇయర్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు పద్మిని, లక్ష్మీప్రసన్న, పూర్ణిమ, మమత, ఉషశ్రీ, ప్రజ్ఞ, స్నేహ తదితరులు ఉన్నారు.



అప్పారెడ్డి గూడలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ ఆశాజ్యోతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్‌నాయక్



సుల్తాన్‌పూర్ గ్రామసభలో ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నా సర్పంచ్ నర్సిములు, ఎంపీపీ ప్రభాకర్,



అంకుశాపూర్‌లో ఆభయ హస్తం దరఖాస్తుల స్వీకరణకు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేస్తున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి

# ప్రజల కోసమే ప్రజాపాలన

## అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ డిసెంబరు30,ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శనివారం నందిగామ మండలం అప్పిరెడ్డి గూడలో సర్పంచ్ జీకే నర్సింలు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై అర్హుల నుండి దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు అప్పరెడ్డి గూడలో ఉన్న హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్ ,ఎంపిడివో బాల్ రెడ్డి, ఎంపివో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తుమ్మల అనిత, ఏపివో సత్యనారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబా యి, విద్యుత్ ఏఈ శ్రీధర్, ఎంపిటిసి కాట్నాలత శ్రీశైలం, చేగూరు సింగిల్ విండో చైర్మన్ జి.అశోక్, నందిగామ ఎంపిటిసి దేపల్లే కుమారస్వామి గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ, అధ్యక్షుడు జంగా నరసింహులు, మేకగూడ సర్పంచ్ పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ కావాలి కృష్ణ నాయకులు పసుల బుచ్చయ్య, కాట్న శ్రీశైలం పాండు, కాట్న సురేందర్, నీరటీ రవీందర్, చిన్న నరసింహులు, సత్యనారాయణ గౌడ్, సి.మల్లేష్, ప్రభు, బాలరాజ్, వార్డుమెంబర్లు ప్రభాకర్, సురేష్, రవి, లింగం, నర్సింలు, కృష్ణ, వెంకటేష్, అన్వర్, పాషా యాదయ్య గౌడ్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

### కోట్‌పల్లిలో..

**కోట్‌పల్లి, డిసెంబరు 30, ప్రభాతవార్త;** తెలంగాణ రాష్ట్రం లో ఎన్నికల సమయంలో ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను ఆరు గ్యారెంటీలను అమలు చేయడం జరుగు తుందని ప్రజా పాలనలో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణకు మంచి ఆదరణ వస్తుందని కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్ అన్నారు. శనివారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని కంకణాలపల్లి, లింగం పల్లి, కరీంపూర్, జిన్నారం గ్రామాల్లో ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరణలో ఆయన హాజరై అయన మాట్లాడారు. తహశీల్దార్ ఆశాజ్యోతి, మండల విద్యాధికారి చంద్రప్ప, ఎంపీయం శివయ్య, ఆర్ఐ బాగ్యలక్ష్మి, ఏఈఓ నర్మధ, ఎంపీఓ డ్యానియెల్, ఏపీఓ ఏలిషా, ఏఈఓ సందీప్, సబ్ ఇంజనీర్ పావని, ఆర్ఐ రమేష్, సీవిల్ సప్ల య్ డిప్యూటీ తహశీల్దార్ పరుశురాం, జాతీయ గ్రామీణ ఉపాధిహామి టెక్నికల్ అసిస్టెంట్‌లు హరిప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ గీతిక, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, అశావర్కుర్లు తదితరులు పాల్గొన్నారు,

**రెండు రోజులు సెలవులు : తహశీల్దార్**

రెండు రోజుల్లో సెలవులు ఉన్నాయని ఈనెల, 31,న జనవరి 1న, సెలవులు ఉన్నాయని తిరిగి ప్రజా పాలన జనవరి 2,న ఉదయం 8, గంటల నుంచి 12, గంటల వరకు బార్వాద్ గ్రామంలో మధ్యా హ్నం 2, గంటల నుంచి సాయంత్రం 6, గంటల వరకు అదే విధం గా కోట్‌పల్లి మండల కేంద్రంలో ఉదయం 8, గంటల నుంచి 12, గంటల వరకు కొత్తపల్లి గ్రామంలో మధ్యాహ్నం 2, గంటల నుంచి సాయంత్రం 6, గంటల వరకు ప్రజా పాలన దరఖాస్తులు చేసుకోవాలని అమె పేర్కొన్నారు.

### బంట్వారంలో..

**బంట్వారం, డిసెంబర్ 30 (ప్రభాతవార్త) :** ఇచ్చిన మాట మేరకు ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎంపీపీ ప్రభాకర్, సర్పంచ్ నర్సిములు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బొపునారం, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభల ు నిర్వహించారు. శనివారం సుల్తాన్‌పూర్ గ్రామ సభలో ఆరు గ్యారంటిలకై 225 ధరఖాస్తులు రాగ, రేషన్ కార్డులు 57 ధరఖాస్తులు వచ్చాయని అధికారులు చెప్పారు. అదే విదంగా బొపునారంలో ఆరు గ్యారంటిలకై 445 ధరఖాస్తులు రాగ, 145 రేషన్ కార్డుల కొరకు ధరఖాస్తులు వచ్చా యన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరు ఆభయ హస్తం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ గ్రామంలో శనివారం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎంపీపీ రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సందీప్ కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కొమ్మిడి జలజ, ఎంపీటీసీ కొమ్మిడి శోభారాణి, వార్డు సభ్యురాలు మేడబోయిన సుగుణ, బత్తుల కృష్ణా గౌడ్, గంగీ శంకర్, రేణుక, లావణ్య, బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కె. సత్యనారాయణ రెడ్డి, పడమటి వెంకట్ రెడ్డి, బత్తుల రామలింగం గౌడ్, పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, బిల్ కలెక్టర్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ ,తదితరులు పాల్గొన్నారు.

### మేడ్చల్‌లో..

**మేడ్చల్, డిసెంబర్ 30. ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని నూతన్‌కల్, మైసిరెడ్డిపల్లి, రావల్‌కోల్ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపిపి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటేష్, ఎంపిడిఓ పద్మావతి, తహశీల్దార్ శైలజ, ఏఓ అర్చన, ఎంఈఓ వసంత, సర్పంచ్‌లు కవితా జీవన్, కరుణాకర్, మహేందర్, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పెద్దేముల్‌లో..

**పెద్దేముల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి లలిత కుమారి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా శనివారం పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్, రెగొండి తదితర గ్రామాలలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిం చారు. గ్రామ సర్పంచ్ శివలీల మల్లేశం, తహసీల్దార్ కిషన్, ఏఈ సందీప్, ఆర్ఐ రాజురెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, మాజీ వైస్ యంపిపి రాంగోపాల్, సీనియర్ నాయకులు టి.చంద్రప్ప, సందమోల్ల శ్రీనివాస్, బి.సత్యనారాయణ. అంగన్‌వాడి సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.



లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన మొయినాబాద్ మండతల తహసీల్దార్ గౌతమ్‌కుమార్



శంకర్‌పల్లి మండలం మారాజ్ పేట్ గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తులు అందజేస్తున్న సర్పంచ్ దోసాడ నరసింహారెడ్డి, గ్రామ కార్యదర్శి రమ్య



మేడ్చల్‌లోని రావల్‌కోల్‌లో దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేష్



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

### పోచారం మున్సిపల్‌లో...

పోచారం మున్సిపల్ అన్నోజిగూడ ఎస్టీ కమ్యూనిటీ హాలు లో ప్రజా పాలన ఆభయ హస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణను చైర్మన్ బి.కొండల్ రెడ్డి శనివారం పరిశీలించారు. మున్సిపల్‌లోని 18 వార్డుల్లో 1860 దరఖాస్తులను స్వీకరించినట్లు చైర్మన్ పేర్కొన్నారు.

### మొయినాబాద్‌లో..

**మొయినాబాద్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభయ హస్తం ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన అందరికి అందుతాయని, ఎవరు అధైర్యపడవద్దని మొయినాబాద్ మండతల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఆర్ఐచంద్రమోహన్, ఆర్ఐ రోజా పాల్గొన్నారు.

### బషీరాబాద్‌లో..

**బషీరాబాద్ డిసెంబరు30,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుండి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. బషీరాబాద్ మండల పరిధిలోని మంథట్టి గ్రామంలో ఎంపిటిసి శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అర్జి దారుల నుండి అభయా హస్తాం గ్యారంటీ పథకాల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిపి కరుణ మా ట్లాడారు. బషీరాబాద్ ఎంపిడివో రమేష్, జడ్పిటిసి మం డల ఇన్చార్జ్ ఎంపిడిఓ సుశీల్ కుమార్ షిండే, ఎంపీఓ విజయ్ కుమార్ తాహాసిల్దార్ ప్రవీణ్ కుమార్ ఇతర అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పీ వెంకటేశం, ఆలం పల్లి శ్రీనివాస్, సిద్దిరాములు పాల్గొన్నారు.

### ఘట్‌కేసర్ రూరల్‌లో..

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త:**

### బొంరాస్‌పేట్‌లో..

**బొంరాస్‌పేట్, డిసెంబర్30, ప్రభాతవార్త :** ప్రజాపాలనలో భాగంగా 3వ రోజు చేట్టుపల్లితాండ, సత్తర్‌కుంటతాండ, నాగిరెడ్డిపల్లి, మదన్‌పల్లి, మదన్‌పల్లితాండ, బాపన్‌చె రువు తాండ, మూడు మామిళ్ళతాండ గ్రామాలలో ఎంపి డిఓ వెంకన్నగౌడ్, ఎంఆర్ఓ వెంకటేష్ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచ్‌లు రాజేశ్వరి, ఉపసర్పంచ్ యాదయ్య, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### శంకర్‌పల్లిలో..

**శంకర్‌పల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అభయ హస్తం ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 2, 11 వార్డుల్లో నిర్వహించిన సభలో ఆమె పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

### పూడూరులో..

**పూడూరు, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం మాప్రభుత్వ పాలసీ అని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 6 గ్యారంటీల అమలుకోసం శనివారం పూడూరు మండల పరిధిలోని కంకల్ గ్రామంలో ప్రజాపాలన గ్రామసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ శాసనసభ ఎన్నికలముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంకోసం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టి దరఖాస్తులను స్వీకరిరించడం జరుగుతుందని తెలియజేశారు. మండల ప్రత్యేక అధికారి సుధారాణి, తహశీల్దారు రమాదేవి, ఎంపిడిఓ ఉమాదేవి. స్థానిక సర్పంచ్ సంతోషవీరన్న, మండల కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పి రఘునాథ్‌రెడ్డి, ఆనందం, సురేందర్, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం, సురేష్, పాల్గొన్నారు.



ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపిడిఓ వెంకన్నగౌడ్.



కంకల్‌గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు



శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన సభలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్



## అవుశాపూర్‌కు చేరుకున్న అయోధ్య రాముడి అక్షింతలు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 30, ప్రభాత వార్త:** అయోధ్య రామయ్య ఆక్షింతలు శనివారం ఘట్‌కేసర్ మండలంలోని అవుశాపూర్ గ్రామానికి చేరుకున్నాయి. అయోధ్యలోని శ్రీ రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని దేశంలోని ప్రతి హిందూ కుటుంబానికి బాలరాముడి పూజలో ఉపయోగించిన అక్షింతలు, రామాలయ చిత్రపటం చేర్చాలని శ్రీ రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల పంపిణీ జరుగుతుంది. అవుశాపూర్‌కు రాముడి అక్షింతలు వచ్చిన సందర్భంగా అవుశాపూర్‌లో శోభాయాత్ర నిర్వహించారు. వరంగల్ జాతీయ రహదారి నుండి గ్రామంలోని శివాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వై. లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకుడు వై. మశ్చేందర్ రెడ్డి, జి. ప్రసాద్, పన్నాల మల్లారెడ్డి, మచ్చ సందీప్, భాను యాదవ్, సాయిలు, కాసుల వెంకటేశ్, రాము పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ద్యావరి విష్ణు అన్న యువసేన సభ్యులు

## భాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**పెద్దేముల్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన బోయిని అనంతయ్య మృతిచెందడంతో పెద్దేముల్ ఎస్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి భాధిత కుటుంబానికి విష్ణు అన్న యువసేన సభ్యులు బోయిని నర్సిములు, పర్యాద రవికిరణ్, నరేష్ సాగర్, బోయిని మోగులప్ప, చెన్నప్ప, రాము, ప్రభు, బోయిని శ్రీకాంత్, బోయిని రాజు తదితరుల ద్వారా రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాధిత కుటుంబాల పాలిట ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి ఆపద్బాంధవుడని అన్నారు. ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పిస్తు వారికి అండగా నిలవడం హర్షనీయమని అన్నారు.

## శివాలయం..ఆంజనేయస్వామి దేవాలయంకు దారి ఇవ్వండి

**బొంరాస్‌పేట్, డిసెంబర్30, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంట గ్రామంలో సర్వేనంబర్ 10లో ఉన్న శివాలయం, ఆంజనేయస్వామి, పుష్కరిణికి వెళ్ళేందుకు దారిఇవ్వలంటూ ఆదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కొడంగల్ కోర్టును ఆశ్రయించడంతో వివరాలను పరిశీలించిన కొడంగల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం భాస్కర్ ఈ విషయంపై ఇంజక్షన్ ఆర్డర్‌ను ఇవ్వడం జరిగిందని గ్రామప్రజలు తెలిపారు. ఇంజక్షన్ ఆర్డర్‌తో శనివారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించడం జరిగిందని వారు తెలిపారు. పురాతన శివాలయం, ఆంజనేయస్వామీ, పుష్కరిణికి మొత్తం ఒక ఎకరము భూమి ఉండేదని గ్రామప్రజలు అందరు కూడా అక్కడ పూజలు చేయడం జరిగిందన్నారు. కానీ నేడు పుష్కరిణితోపాటుగా దేవాలయాలకు వెళ్ళకుండా భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించుకోని దేవాలయాల చుట్టూ మొత్తం పెన్సింగ్ వేసి పూజలు చేయకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. తహసీల్దార్ వెంకటేష్ తమ గ్రామానికి వచ్చి ఆక్రమంగా ఏర్పాటు చేసిన పెన్సింగ్‌ను తొలగించి దేవాలయాలకు వెళ్ళేందుకు ప్రజలకు దారి ఏర్పాటుకు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాములు, అనంతయ్య, బాబయ్యనాయుడు, వెంకటయ్య, గ్రామప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నుండి నియామక పత్రం అందుకుంటున్న శ్యాంసుందర్

## నియోజకవర్గ సేవా దళ్ అధ్యక్షుడిగా శ్యాంసుందర్

**యాచారం డిసెంబరు30,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడిగా సన్నాయిల శ్యాం సుందర్‌ని సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మిద్దెల జీతేందర్ నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ... సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రం గారెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంఖాల దాసుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీనాపై ఎంతో నమ్మకంతో ఇచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ సర్పంచ్ కప్పరి లక్ష్మయ్య, ఇబ్రహీంపట్నం మండల నాయకులు రవనమోని లింగం, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కప్పరి చందు, సాయి తేజ, ఆనంద్, కిషోర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వైస్ ఎంపిపి రామకృష్ణకు పితృవియోగం

**యాచారం డిసెంబరు30,ప్రభాతవార్త :** యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి గజ్జి రామకృష్ణ యాదవ్ తండ్రి ఎట్టయ్య శుక్రవారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. ఈసందర్భంగా పలురువు నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి జ్యోతి శ్రీనివాస్ నాయక్, వైస్ ఎంపిపి కొడవ కంటి శ్రీనివాస్ రెడ్డి, ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, గున్‌గల్ మాజీ ఎంపిటిసి కాశమల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలి

**షాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయంలో గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ.... ప్రతి ఒక్కరు భగవద్గీత చదవడం అలవాటుగా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిని మనిషి మనిషిలా బతకడం నేర్పేదే భగద్గీత అన్నారు. గీతను చదవడం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వసం కల్గుతుందన్నారు. జాతిపిత మహాత్మగాంధీ కూడా గీతను అనుసరించి అహింసా మార్గంలో దేశానికి స్వతంత్ర్యం తీసుకువచ్చాడని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలన్నారు. ఈకార్యక్రమం లో సర్పంచ్ జయమ్మసుదర్శన్, మాజీ ఎంపీపీ వెంకటయ్య, గ్రామస్థులు లింగం, మల్లారెడ్డి, రాంచంద్రయ్య, భాస్కర్, జైపాల్‌రెడ్డి, సురేష్, నర్సింలు, పురుషోత్తం తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య